క్లుప్తంగా

అతివేగం ప్రమాదకరం



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ జహీర్

నందలూరు : మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, ఓవర్ లోడ్ ఉండకూడదని, సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. రహదారి నియమాలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ నాయక్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



రఘురామరాజు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

చిన్నమండెం : ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అని పలువురు వక్తలు కొనియాడారు. చిన్నమండెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రఘురామరాజు పదవీ విరమణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, గున్నికుంట్ల సర్పంచ్ భూషణ్‌రెడ్డి, గురిగింజకుంట సర్పంచ్ రఘునాథరెడ్డి, రెస్కో భాస్కర్‌రాజు, మనం సంస్థ సభ్యులు, చిన్నమండెం ఎంఈఓ శివానాయక్, గాలివీడు ఎంఈఓ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్డును పంపిణీ చేస్తున్న వైద్యులు

సిద్దవటం : సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు గర్భిణులకు సోమవారం పండ్లు, బ్రెడ్డు, కూల్‌డ్రింక్‌ను పంపిణీ చేశామని సమాజ్‌వాది పార్టీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు భవనాశి వెంకటసుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకుడు అఖిలేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, గర్భిణులకు వైద్యుల చేత పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బరాయుడు కుటుంబీకులు, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీ దిన్నిమీదపల్లిలో సోమవారం ఓ విషయమై ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. దీంతో ఓ వర్గాన్ని చెందిన పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాయచోటిలోని ఆసుపత్రికి తరలించారు. వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

మున్సిపల్ సిబ్బందికి వ్యక్తిగత రుణాలివ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల సిబ్బందికి వ్యక్తిగత రుణాలు మంజూరుకు తగిన చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ఎస్‌బీఐ (బ్యాంకు) ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది దాదాపు రెండు వేల మంది జీతాలు పొందుతున్నారన్నారు. అలాగే మున్సిపాలిటీ స్థాయి నుండి నగరపాలక సంస్థ వరకు ట్రెజరీ సంబంధిత లావాదేవీలు బ్యాంకు ద్వారా జరుపుతున్నారన్నారు. అయితే గత ఒకటిన్నర సంవత్సరాలుగా వ్యక్తిగత రుణాలు కోసం మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితులు, శుభకార్యాల సమయంలో డబ్బు అవసరమైనప్పుడు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఈ విషయంగా బ్యాంకు ఉన్నత అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా సమస్యలను పరిష్కరించకపోవడం తగదన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు.

సమష్టిగా అతిసార వ్యాధిని అరికడదాం

- అంగన్‌వాడీల్లో అవగాహన కార్యక్రమాలు
- వ్యాధి లక్షణాలను వివరించిన వైద్య సిబ్బంది
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచన



చిట్వేలి: అంగన్‌వాడీ కేంద్రంలో పాలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ

చిట్వేలి : ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణానికి అతిసార వ్యాధి కారణమని, దానిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం సంగాదేవిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, మూడు సంవత్సరాలలోపు పిల్లలకు పాలు పంపిణీ చేశారు. అనంతరం అతిసార వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ రాజేశ్వరీ మాట్లాడుతూ అతిసార వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నప్పుడు డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సంగాదేవిపల్లి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, గ్రేడ్-1 సూపర్‌వైజర్ విశాలాక్షి, అంగన్‌వాడీ వర్కర్లు సుబ్బలక్ష్మీ, సుబ్బరత్న, మహిళలు, పిల్లలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : డెంగ్యూ, అతిసార వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దుద్యాల గ్రామం పొట్టిరెడ్డిగారిపల్లెలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డెంగ్యూ, అతిసార వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాలు నొప్పులు తదితర లక్షణాలతో డెంగ్యూ జ్వరం వస్తుందన్నారు. అప్రమత్తంగా ఉండి వెంటనే వైద్య సహాయం తీసుకుంటే వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ప్రధానంగా దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత మురుగునీరు నిల్వ ఉండకుండా చూడడం వంటి ప్రక్రియలతో దోమలను అరికట్టాలన్నారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వండిన మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కాచి వడపోసిన పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. కార్యక్రమం వైద్యులు మధుసూదన్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు వైద్య, ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సదాశివరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, హెచ్‌పీ



సంబేపల్లె: డెంగ్యూ, అతిసార వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

షబ్రీన్, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఈడిగపల్లె విలేజ్ క్లీనిక్‌లతో డయేరియా క్యాంపెయిన్‌ను డాక్టర్ హసన్ వలీ, ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అన్ని గ్రామాలలో ప్రజలకు అతిసార వ్యాధిపై అవగాహన, నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. పుట్టినబిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తామని తెలియజేశారు. ఓఆర్ఎస్‌లు అంగన్‌వాడీ సెంటర్లు, స్కూల్స్, ఆశ వర్కర్ల వద్ద నిల్వ ఉంచడం జరుగుతుందన్నారు. తాగునీటి వనరులు, నీటి సరఫరా పైపులు శుభ్రపరిచి ట్యాంకులలో క్లోరినేషన్ ద్వారా సురక్షితమైన మంచినీరు తాగాలని వైద్యులు సూచించారు. అనంతరం అతిసార వ్యాధి నివారణ కరపత్రాలను అందజేశారు.



సుండుపల్లె: పోస్టర్ల ద్వారా అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా ఐసీఈయూ ఆవిర్భావ దినోత్సవం



ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ నినాదాలు చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

రాజంపేట టౌన్ : స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప డివిజన్ యూనియన్ కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన వారి స్థానంలో కొత్త ఉద్యోగాల నియమకాలు లేకపోవడంతో సిబ్బందిపై పనిభారం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

పనిభారం తగ్గించేందుకు క్లాస్-384 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని లేకుంటే ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ రాజీలేని పోరాటం సాగిస్తోందన్నారు. ఈ సందర్భంగా యూనియన్ సాధించిన విజయాల గురించి ఉద్యోగులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సుభాచంద్ర, గంగాధర్, లలితమ్మ, రాఘవేంద్ర, బాషా, సుబ్బయ్య, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించండి

రాయచోటి అర్బన్ : గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బస్టాండు వద్ద నుంచి నాలుగురోడ్ల కూడలి (గేటు) వద్దకు తరలించాలని సీపీఐ రాయచోటిశాఖ కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌కు విన్నవించారు. సోమవారం ఆయన పలువురు గాలివీడు వాసులతో కలసి కలెక్టర్‌ను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జనసంచారం లేని శ్మశాన వాటిక వద్ద ప్రభుత్వ వైద్యశాలను నిర్మించడాన్ని తప్పుబట్టారు. వైద్యం చేయించుకోవాలనుకునే వారు శ్మశానం నడుమ నుంచి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశు వైద్యశాలను అందరికి అందుబాటులో ఏర్పాటు చేసి ప్రజావసరాల కోసం ఉద్దేశించిన వైద్యశాలు శ్మశానం వద్ద ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా మండలంలోని చుట్టుపక్కల గ్రామాలన్నింటికి అనువుగా ఉన్న నాలుగురోడ్ల కూడలి (గేటు)వద్దకు పీహెచ్‌సీని తరలించేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

గుర్రంకొండ మార్కెట్‌యార్డు అధికారులపై చర్యలు తీసుకోండి

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న గుర్రంకొండ మార్కెట్ యార్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన జాయింట్ కలెక్టర్‌ను కలుసుకుని మాట్లాడారు. మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ పద్ధతి అమలుతోపాటు కమీషన్, హమాలీలు, కూలీలు, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు తదితరాలన్నింటిని రైతులే బరాయించాలని మండీల యజమానులు చెబుతున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రైతులను మండీల యజమానులు ఇబ్బందులకు గురిచేస్తూ భయపెడుతున్నారన్నారు. ఈ విషయాలను పలుమార్లు మార్కెట్‌కమిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న అన్యాయాలు, ఇబ్బందులపై విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. ఆ మేరకు ఒక వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతుసమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతు సంఘం నేత రంగారెడ్డి తదితరులు

హెల్మెంట్ ధరించి ప్రాణాలు రక్షించుకోండి



ట్రాఫిక్ నియమాలపై సూచనలు చేస్తున్న ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం : ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి విలువైనటువంటి ప్రాణాలను రక్షించుకోవాలని మండల ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలోని మూడురోడ్ల కూడలిలో ట్రాఫిక్ నియమాల గురించి, ప్రమాదాల గురించి వాహనదారులకు వివరించారు. మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారుల ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలియజేశారు. మత్తుపదార్థాలు సేవించి వాహనాన్ని నడపరాదని సూచించారు. కార్యక్రమంలో మండల పోలీసులు నాయక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్

- జయప్రదం చేయాలని పిలుపునిచ్చిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐలు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

రాయచోటి అర్బన్ : జూలై 4న దేశవ్యాప్తంగా నిర్వహించే కేజీ టు పీజీ విద్యార్థుల సమ్మెను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీట్ పరీక్షను రద్దుచేయడంతోపాటు పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను వెంటనే రద్దుచేయాలంటూ డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు గాను 720 మార్కులు రావడం, అందులో 7మంది విద్యార్థులు హర్యానాలోని ఒకే కేంద్రానికి సంబంధించిన వారు కావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్‌టీఏ విడుదల చేసిన ఫలితాలను రద్దుచేయడం ద్వారా వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. పేపర్ లీక్ జరిగిందన్న కారణంగా నెట్ పరీక్షను రద్దుచేసిన ప్రభుత్వం అవే ఆరోణలున్న నీట్ పరీక్షను ఎందుకు రద్దుచేయడం లేదంటూ మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం వెంటనే నెట్, నీట్ పేపర్ లీక్ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పేపరు లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలంటూ కోరారు. 4వ తేదీ నిర్వహిస్తు న్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులంతా కలసికట్టుగా విజయవంతం చేయాలంటూ కోరారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

నందలూరు : కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాల పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్, పోలీస్‌శాఖ సంయుక్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మారిన చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే నేరాలను అరికట్టడం సులువు అవుతుందన్నారు. న్యాయ వ్యవస్థలో మార్పులు ద్వారా ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఇండియన్ ఎవిడెన్స్ స్థానంలో కొత్తగా వచ్చిన చట్టాలు అమలులో ఉంటాయని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో సమన్లు, ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్ మోడల్‌లో నమోదు వల్ల చట్టాలు బాగా అమలవుతాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ నీలవేణి భారతీయ న్యాయ సంహిత, నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అభినియం గురించి విపులీకరించారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు ఈ చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటా

రాజంపేట : రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొల్లం గంగిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వర్గీయులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తిరుపతిలోని తన స్వగృహంలో గంగిరెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా యువత ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఆయన కూడా రక్తదానం చేశారు. అలాగే గంగిరెడ్డి అభిమానులు రేణిగుంటలోని అభయక్షేత్రంలో (ప్రత్యేక అవసరాలు కలిగిన పునరావాసక్షేత్రం) అనాథలైన వృద్ధులు, మహిళలకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లం గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవలో తాను ఎల్లప్పుడూ ముందుంజలో ఉంటానన్నారు. పుట్టినరోజు నాడు అభిమానులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు కొల్లం గంగిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుల్లంపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతిలోని కొల్లం గంగిరెడ్డి స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్.గొల్లపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కొల్లం గంగిరెడ్డిని ప్రత్యేకంగా సన్మానించి కేక్‌ను తినిపించారు.



రాజంపేట: అభిమానులు ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న కొల్లం గంగిరెడ్డి

ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : పట్టణంలోని హరిశ్చంద్రనగర్‌కు చెందిన ఎలక్ట్రీషన్ షేక్ రియాజ్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం కడపలోని రిమ్స్‌లో వైద్యం పొందుతున్నాడు. రియాజ్‌కు వైద్య ఖర్చులతోపాటు వారి కుటుంబ జీవనాధారం కష్టతరమైంది. విషయం తెలుసుకున్న శ్రీ అన్నమయ్య ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు రియాజ్‌కు నందిని ఎలక్ట్రికల్ షాపు యజమాని రూ.25వేలు ఆర్థికసాయం చేశారు. నగదును యూనియన్ జిల్లా కార్యదర్శి మునగపాటి తరుణ్‌కుమార్ నాయకులతో కలిసి సోమవారం రియాజ్‌కు అందజేశారు. యూనియన్ తరఫున కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసానిచ్చారు.

బోధనా సామర్థ్యాన్ని పెంచడానికి టీచ్ టూల్

మదనపల్లె సిటీ : ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాన్ని పెంచడానికి టీచ్ టూల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీచ్‌టూల్ శిక్షణ కార్యక్రమం డివిజన్ నుంచి ఎంపిక చేసిన 200 మంది ఉపాధ్యాయులకు నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా విద్యాబోధన సాగించడానికి అవసరమైన మెలకువలను నేర్పించనున్నట్లు తెలిపారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు కేటాయిస్తున్న సమయంలో ప్రతి నిమిషం విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సాల్ట్ ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులో భాగంగా టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది



రాయచోటి టౌన్: పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ రంగస్వామి తదితరులు



సిద్దవటం: పాలకొండ్రాయునిపల్లెలో పెన్షన్‌లను పంపిణీ చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీలోని పాలకొండ్రాయునిపల్లె గ్రామంలో సోమవారం రాజంపేట నియోజకర్గ తెలుగుదేశం ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం పెన్షన్ నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, టీడీపీ నాయకులు హరిప్రసాద్, కుప్పాల వెంకటసుబ్బయ్య, రాజానాయుడు, చెంచయ్య, నాగమునిరెడ్డి, పుత్తా రామచంద్రయ్య, జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : సామాజిక పెన్షన్లు ఎన్‌టీఆర్ భరోసా పథకం ద్వారా సోమవారం ఉదయం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగస్వామి రాయచోటి పట్టణంలోని వీధులలో పంపిణీ చేస్తున్న పెన్షన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బందిని పర్యవేక్షించారు.

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని పలు పంచాయతీలలో సోమవారం ముక్కా వరలక్ష్మీ పింఛన్లు పంపిణీ చేశారు. అలానే మాజీ ఎమ్మెల్యే బత్యాల చెంగల్రాయుడు ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్టీ కాలనీలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు.

సాక్షి, నెట్‌వర్క్: చిన్నమండెంలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి మండిపల్లి హరిత పాల్గొన్నారు. అలానే రామాపురం మండలంలోని చిట్లూరు గ్రామ పంచాయతీ చిట్లూరు కస్పా, పాలన్నగారిపల్లెలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ప్రారంభించారు. సుండుపల్లె మండలంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్లను అందజేశారు. పుల్లంపేట మండల వ్యాప్తంగా సోమవారం ఎన్టీఆర్ పింఛన్లను గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అందజేశారు.

ఎరువులకు రశీదు తప్పనిసరి

కలకడ : రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని మదనపల్లె ఏడీఏ శివశంకర్ హెచ్చరించారు. సోమవారం కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ధరల పట్టిక నమోదు, రికార్డుల మేరకు గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలించారు. విక్రయ వస్తువుల నమోదు, బిల్లు పుస్తకాలు, ఈపాస్ యంత్రంలోని స్టాక్ నిల్వలను సరిచూశారు. బిల్లు లేకుండా ఎరువులు, మందులను రైతులు కొనుగోలు చేయరాదన్నారు.

కనిపించే ప్రత్యక్ష దైవాలు వైద్యులు

- ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం
- వైద్యులను సన్మానించిన వైద్య సిబ్బంది, నాయకులు

రాజంపేట రూరల్ : జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కేవీ నాగేశ్వరరాజు ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను వేడుకగా నిర్వహించుకున్నారు. ముందుగా వైద్యులందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికి ఒకరు తినిపించుకొవడంతోపాటు డాక్టర్ బీసీ రాయ్ సేవలను కొనియాడారు. వైద్య వృత్తిలో కొనసాగే ప్రతి ఒక్కరూ డాక్టర్ బీసీ రాయ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ వేడుకలలో వైద్యులు ఏం మాధవకుమార్‌రెడ్డి, ఏ అనీల్‌కుమార్, పీ మస్తాన్‌రావు, ధనశ్రీ, సౌజన్య, మెహర్‌ముంతాజ్, నాగలక్ష్మి, ప్రకృతి, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని కె.బోయినపల్లిలోని రాజు హెల్త్ కేర్ సెంటర్‌లో ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య ఫెడరేషన్ సభ్యులు, ఆర్‌ఎంపీ అసోషియేషన్ సభ్యులు డాక్టర్ డీవీఎస్ రాజు ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ ఎంవీ రమణ, జాయింట్ సెక్రటరీ టి.నాగరాజు, సభ్యులు సాయిచంద్, రేణుప్రసాద్, ప్రవీణ్‌కుమార్, రాజా, కృష్ణారెడ్డి, కుమార్, పవన్‌కుమార్, సిద్దుబాషా, నరసింహరాజు, యాసర్, వరదరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హేమసుందరం తదితరులు పాల్గొన్నారు. కాగా చెర్రీస్ అకాడమీ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ ఆర్.ప్రేమలత, ఎండీ ఆర్ వెంకటేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఫిజియో థెరిపిస్ట్ డాక్టర్ శిరీషను సన్మానించారు.



రాయచోటి అర్బన్: వైద్యులను సన్మానించిన రాయచోటి లయన్స్ క్లబ్ సభ్యులు

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : కనిపించే ప్రత్యక్ష దైవాలు వైద్యులు అని లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పి.యస్.హరినాథరెడ్డి, మహమ్మద్‌లు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన వైద్యులు బయారెడ్డి, రమాదేవి, నారాయణరెడ్డి, మహేశ్వరరాజు, ఉషారాణి, అరుణ్, భరత్, మాధవిలతలను క్లబ్ సభ్యులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, చాన్ బాష, క్లబ్ కార్యదర్శి ఇందాదుల్లా, ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, కోశాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి, సాయి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : వైద్యులు దేవుళ్లతో సమానమని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా నందలూరు ప్రభుత్వ వైద్యాధికారి శరత్ కమల్‌ను నందలూరు ప్రభుత్వ వైద్యశాలలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎంతో గౌరవం ఇస్తూ మంచిగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శరత్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్, గోపినేని హిమగిరినాథ్ యాదవ్, చామంచి పెంచలయ్య, నాగేంద్ర, దండు నాగేశ్వరరావు, షేక్ మౌల, తుమ్మది శివకుమార్, వైద్య సిబ్బంది లక్ష్మయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: ఏరియా ఆసుపత్రిలో కేక్ కట్ చేసిన వైద్య బృందం



నందలూరు: డాక్టర్ శరత్ కమల్‌ను సన్మానిస్తున్న వివిధ పార్టీల నాయకులు